క్లుప్తంగా

కర్ణాటకలో విప్ పర్యటన



సుబ్రహ్మణ్యస్వామి వారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్, కుమారుడు

వేములవాడ: కర్నాటక రాష్ట్రం దక్షిణ కన్నడ జిల్లాలోని సుప్రసిద్ధ శ్రీ కుక్కే సుబ్రహ్మణ్యస్వామి వారిని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, మొక్కు చెల్లించుకున్నట్లు విప్ తెలిపారు.

కాల్వపై సర్వే



వేములవాడ శివారులోని కాలువను సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి స్పందన

వేములవాడ: పట్టణ శివారులోని మున్సిపల్ మంచినీటి బావి మార్గంలోని కాల్వ కబ్జాపై అధికారులు గురువారం సర్వే చేపట్టారు. కాల్వ కబ్జాకు గురవుతున్న విషయాన్ని 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సర్వే అధికారులు స్పందించారు. సర్వేయర్ రాజగోపాల్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ కాల్వహద్దులపై సర్వే చేశారు. మూడు రోజుల సర్వే తర్వాత ఉన్నతాధికారులకు పూర్తిస్థాయి రిపోర్టు అందజేస్తామని తెలిపారు. 30 ఫీట్ల వెడల్పుతో ఉన్న కాలువ కేవలం మూడు పీట్లకే చేరిందన్నారు.

నేడు జెడ్పీ స్థాయీసంఘాల సమావేశం

సిరిసిల్ల: జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఉమారాణి తెలిపారు. సిరిసిల్ల జెడ్పీ ఆఫీస్‌లో జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని వివరించారు.

పొన్నంపై విమర్శలు సరికాదు

సిరిసిల్లటౌన్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార విమర్శలు చేయడం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సరికాదని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎస్.కే. సాహెబ్ అన్నారు. బీఆర్‌ఎస్ అధిష్ఠానం మెప్పుకోసం ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమన్నారు. నాయకులు పెద్దిగారి శ్రీనివాస్, కూతరు వెంకట్‌రెడ్డి,లింగంపల్లి ఎల్లాగౌడ్, ఓరుగంటి తిరుపతి, మల్లేశ్‌గౌడ్ తదితరులున్నారు.

నేతన్న దీక్ష తాత్కాలిక వాయిదా

సిరిసిల్లటౌన్: జూలై 7 నుంచి చేపట్టాల్సిన నేతన్నదీక్షను చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హామీతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ తెలిపారు. నేతకార్మికులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన శైలజా రామయ్యర్ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. బతుకమ్మ చీరల పది శాతం యారన్ సబ్సిడీ డబ్బులను విడుదల చేశామని రెండు, మూడు రోజుల్లో కార్మికుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారని వివరించారు. ఆమె హామీతో దీక్షను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం సిరిసిల్లలోని చేనేత, జౌళిశాఖ ఆఫీసులో వినతిపత్రం అందించారు. అన్నల్‌దాస్ వేణు, దేవదాసు, రమేశ్, సత్యం, మల్లేశం, చంద్రకాంత్ పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులు చేపట్టాలి

ముస్తాబాద్: ముస్తాబాద్, దుబ్బాక డబుల్ రోడ్డు పనులు చేపట్టి రోడ్డు ప్రమాదాలు నివారించాలని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చెవుల మల్లేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో వారు గురువారం మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ ముస్తాబాద్ నుంచి మోహినికుంట వరకు మంజూరు చేసిన డబుల్ రోడ్డును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జిల్లా సరిహద్దు వరకు మంజూరు అయిన రహదారిని కాంగ్రెస్ నాయకులు కుట్రపూరితంగా నిధులు వెనక్కి తీసుకున్నారని ఆరోపించారు. సింగిల్‌లైన్ రోడ్డుతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని రోడ్డును డబుల్‌రోడ్డుగా పూర్తిచేశారని, జిల్లా సరిహద్దు వరకు 5 కిలోమీటర్ల దారిని విస్తరించాలని డిమాండ్ చేశారు. దబ్బెడ రాజు, ఎలుసాని దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ గ్రామానికి చెందిన పవన్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరాడు. వైద్యఖర్చుల కోసం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో రూ.2.10లక్షల ఎల్‌వోసీని గురువారం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎల్‌వోసీకి సహకరించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ నిర్మాణం

- ఆరునెలల క్రితం రోడ్డు విస్తరణ పనులు
- ఇళ్లకంటే ఎత్తులో రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ
- దుకాణాలు నడవక, వ్యాపారం సాగక ఇబ్బంది
- ఇళ్లు కూల్చివేసే పరిస్థితి నెలకొందని ప్రజల ఆవేదన
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



ఇళ్లకంటే గజం ఎత్తులో నిర్మించిన డ్రైనేజీ



హోటల్ నడుపుకుంటూ దీనంగా చూస్తున్న ఈమె పేరు బత్తుల నాగమణి. రెండేళ్ల క్రితం తమకున్న రోడ్డు పక్కన స్థలంలో రూ.55 లక్షలు బ్యాంకు లోన్ తీసుకొని ఇల్లు నిర్మించారు. కొద్దిరోజులకే రోడ్డు విస్తరణలో భాగంగా ఆరు నెలల క్రితం ఎక్కువ ఎత్తులో రహదారి నిర్మాణంతో పాటు గజం ఎత్తులో డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. దీంతో హోటల్ సరిగా నడవక లోన్ డబ్బులు తీరడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తోంది. నూతనంగా నిర్మించిన ఇల్లు కూల్చి వేసే పరిస్థితి దాపురించిందని, ఎంత చెప్పినా రోడ్డును ఎత్తు పెంచారని, తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతోంది.



ఇంట్లో కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఇతని పేరు పడాల రాజేశం. తన దుకాణం పక్కనే గజం ఎత్తులో డ్రైనేజీని నిర్మించారు. దీంతో కిరాణా షాపు సరిగా నడవక ఇబ్బంది పడుతున్నాడు. దీంతో తన ఇల్లు కూడా కూల్చివేసే పరిస్థితి నెలకొందని వాపోతున్నాడు. రోడ్డు విస్తరణ సమయంలో ఎక్కువ ఎత్తు పెంచవద్దని బతిమాలినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇది వీరి సమస్యే కాదు. మండలకేంద్రంలోని కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న సుమారు 2 వందల ఇళ్లు, దుకాణ సముదాయాల వారందిరిదీ ఇదే దుస్థితి.

రుద్రంగి: మండలకేంద్రంలోని కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారిని రోడ్డు విస్తరణలో భాగంగా రూ.8 కోట్లతో ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సైడ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే రోడ్డును అప్పటికంటే ఎక్కువ ఎత్తు పెంచడంతో రోడ్డుకిరువైపులా ఉన్న దుకాణ సముదాయాలు, ఇళ్లు సుమారుగా గజం లోతులోకి వెళ్లాయి. దీంతో ఇళ్లు, దుకాణాల్లోకి వెళ్లడం కష్టంగా మారిందని, దీంతో వాటిని కూల్చివేసే పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డుకంటే ఇళ్లు తక్కువ ఎత్తులో ఉండటంతో వరదనీరు, డ్రైనేజీ మురుగునీరు వచ్చి చేరుతోందని వాపోతున్నారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చే సమయంలో డ్రైనేజీలో పడిపోతూ గాయాలపాలవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లకంటే ఎక్కువ ఎత్తులో రోడ్డు నిర్మాణం చేపట్టారని, దీంతో తమ ఇళ్లు కూల్చుకునే పరిస్థితి ఏర్పడటంతో తీవ్రంగా నష్టపోతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యను పరిష్కరించి తమకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

ఇష్టానుసారంగా నిర్మాణాలు..

ఇటీవల మండలకేంద్రంలోని కోరుట్ల, వేములవాడ ప్రధాన రోడ్డుకిరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టారని, అయితే ఇష్టారీతిగా నిర్మాణం జరిపినట్లు ఆరోపణలున్నాయి. కాగా పలుకుబడి, హోదా ఉన్న వారి ఇళ్లముందు తక్కువ ఎత్తు, అమాయక ప్రజల ఇళ్ల ముందు ఎక్కువ ఎత్తులో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

చెరువు కట్టలను తలపించేలా..

రుద్రంగిలోని ప్రధాన రహదారికి వచ్చేందుకు నిర్మించిన అప్రోచ్ రోడ్లు చెరువు కట్టలను తలపిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అప్రోచ్‌దారుల నుంచి రోడ్డుపైకి ఎక్కే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అప్రోచ్ రోడ్లను రోడ్డుకు సమాంతరంగా చేయాలని వారు కోరుతున్నారు.

నిబంధనల మేరకే నిర్మాణం



రుద్రంగిలోని ప్రధాన రహదారి నిర్మాణం నిబంధలన మేరకే చేపట్టాం. ఉన్న ఇళ్లను కూల్చివేసే సరిస్థితి రాకూడదని ఉన్నంతలోనే సెట్ బ్యాక్ చేసి సైడ్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నాం.

– సతీశ్, ఏఈ ఆర్‌అండ్‌బీ, ఇన్‌చార్జి రుద్రంగి

అటవీ భూములను కాపాడుకోవాలి

- చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు



దేవుని తండాలో గ్రామస్తులతో మాట్లాడుతున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి: అటవీ భూముల జోలికి వెళితే అనవసరంగా కేసుల పాలవుతారని, చందుర్తి సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని దేవుని తండాలో నిర్వహించిన పోలీసు దర్బార్‌లో ఆయన మాట్లాడారు. అటవీ భూములను రక్షించుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందన్నారు. చెట్లను అక్రమంగా నరికి వేస్తూ అడవులను సాగు చేస్తే చర్యలు తప్పవన్నారు. తండాలోని కొందరు అటవీ భూములను సాగుచేస్తున్నారని, వారిలో అవగాహన కల్పించేందుకు దర్బార్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిధర్‌రెడ్డికి అభినందన



గిరిధర్‌రెడ్డిని అభినందిస్తున్న రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట: ఆపదలో ఉన్న వారికి 49 సార్లు రక్తదానం చేసి పలు అవార్డులు అందుకున్న వంగ గిరిధర్‌రెడ్డిని గురువారం డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మొక్కతో అభినందించారు. ఎల్లారెడ్డిపేటలో గిరిధర్‌రెడ్డిని అభినందిసూ భవిష్యత్తులో ఆపదలో ఉన్న వారికి ఇలాగే రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని బండలింగంపల్లికి చెందిన మ్యాదరి నారాయణ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటంబాన్ని రవీందర్‌రావు పరామర్శించారు. ఆయనవెంట సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బండ నర్సయ్య, మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, మాజీ ఎంపీటీసీ దేవరాజు తదితరలున్నారు.

చెక్కులు అందజేత

గంభీరావుపేట: మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు గురువారం టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రధానమంత్రి సురక్షబీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన చెక్కులను అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో పశువులు సంచరించకుండా చూడాలి

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని రద్దీప్రాంతాల్లో పశువులను సంచరించకుండా యజమానులు చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి. లావణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్, బస్టాండ్, ప్రధాన రోడ్లపై పశువులు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. యజమానులు తమ పశువులను రోడ్లపైకి రాకుండా చూడాలని, లేకపోతే వాటిని గోశాలకు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సిరిసిల్లటౌన్: ఇటీవల ఆత్మహత్య చేసుకొని ఇద్దరు నేత కార్మికులు మృతిచెందగా బాధిత కుటుంబాలకు తెలంగాణ పద్మశాలీ సంఘం కన్వీనర్ బూర మల్లేశం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కుడిక్యాల నాగరాజు ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి రూ. 10వేల నగదు, రూ. 25కిలోల బియ్యం , ఇందిరమ్మ కాలనీకి చెందిన కార్మికుడు ముదిగొండ నరేశ్ చనిపోగా బాధిత కుటుంబానికి రూ.5వేలు నగదును అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గాజుల బాలయ్య, గుడ్ల వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

సిరిసిల్లటౌన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్లలో హెచ్‌సీయూ వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్‌కుమార్, మల్లారపు ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మానేరు వాగులోకి దిగకుండా చర్యలు

ముస్తాబాద్: ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మానేరు వాగు పరీవాహక గ్రామాల్లో చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ సురేశ్ తెలిపారు. రామలక్ష్మణపల్లె, ఆవునూర్, తుర్కపల్లి గ్రామాల్లో మానేరు వాగు ఒడ్డున జేసీబీతో కందకాలు తీసినట్లు తెలిపారు. ట్రాక్టర్లను వాగులోకి తీసుకెళ్లకుండా కందకాలు ఏర్పాటు చేశామన్నారు. అనుమతులు లేకుండా ట్రాక్టర్లను వాగులోకి దించితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

• ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు బత్తుల దీపక్, గుడికందుల విజయభాస్కర్‌రెడ్డి మానేరువాగులోంచి ఇసుకను ఎల్లారెడ్డిపేటలో విక్రయించేందుకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాక్టర్లను పట్టుకొని చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు దీపక్, విజయభాస్కర్‌రెడ్డితో పాటు వాహన యాజమానులు దుర్గయ్య, సంతోష్‌పై కేసున మోదు చేసినట్లు చేశామని, ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

• ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

ముస్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఏబీవీపీ నాయకులు రాజేశ్, మధు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫామ్స్ అందించాలన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేక విద్యార్థులు పాఠశాలల్లో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేసే టీచర్లకు సమాన పనికి సమానే వేతనాలు ఇవ్వాలని కోరారు.

• కార్యవర్గం ఎన్నిక

గంభీరావుపేట: మండల మున్నూరుకాపు యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అయిలేని కిరణ్‌బాబు (లింగన్నపేట), ప్రధాన కార్యదర్శిగా సుంకరి ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా గ్యాద దేవరాజు, చిలుక ప్రశాంత్, కార్యదర్శిగా దేశెట్టి రాజశేఖర్, మేళ్ల శ్రావణ్, ప్రచార కార్యదర్శిగా వరుస రాజు, కార్యవర్గ సభ్యులుగా జిల్లెల్ల మహేందర్, చిలుక ఎల్లం, కొమిరిశెట్టి రాజు, సుంకరి నరేశ్, గంగిశెట్టి మనోజ్, బండెల వేణుగోపాల్, పల్లె శ్రీనివాస్, నాయిని శంకర్, గడ్డం బాలు ఎన్నికయ్యారు.

• లారీ అసోసియేషన్ కార్యవర్గం..

గంభీరావుపేట మండల లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సయ్యద్ సాధిక్, అధ్యక్షులుగా పల్లపు నర్సింలు, ఉపాధ్యక్షుడిగా మూల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ వహీద్, కోశాధికారిగా పల్లపు నరేశ్, కార్యదర్శిగా చెల్ల వెంకటేశ్, చెల్ల సతీశ్, కార్యవర్గ సభ్యులుగా పల్లపు దేవయ్య, పల్లపు పెద్ద నర్సింలు, పల్లపు నర్సింలు ఎన్నికయ్యారు.

పూడికతీత పనులు ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని రామన్నపల్లె గ్రామ శివారులోని ఎల్లమ్మ చెరువు కాలువ రైల్వేపనులతో మట్టితో నిండిపోయింది. దీంతో బాగుచేయాలని రైతులు అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయారు. గురువారం వారే స్వయంగా జేసీ బీతో కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. నాయకులు మందాటి తిరుపతి యాదవ్, నక్క రవి, అనిల్, కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు వె న్నమనేని శ్రీధర్ రావు, రవి, ముత్యం, శ్రీనివాస్, రైతులు జూపల్లి శ్రీనివాస్, కావటి లక్ష్మారెడ్డి, బాలనర్సు, ఎల్లయ్య, తిరుపతి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని లింగంపల్లి, ఎదురుగట్ల గ్రామాల్లో మృతుల కుటుంబాలను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించా రు. మున్సిపల్ పరిధిలోని బాలనగర్ వార్డులో మ్యాకల అర్పిత అనారోగ్యంతో గురువారం మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయనవెంట కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, రాయపురెడ్డి, సల్మాన్ రెడ్డి, బాలస్వామి, ఎన్నారెడ్డిలు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ అంజిరెడ్డి

ముస్తాబాద్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. మండలంలోని చిప్పలపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ సెస్ పరిధిలో రైతులందరికీ నిరంతర విద్యుత్‌ను అందించేందుకు పాలకవర్గం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడిచర్ల దేవయ్య, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ రాజమల్లు, లక్ష్మణ్‌శెట్టి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

ఎల్లారెడ్డిపేట: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పీసీసీ అధికార ప్రతినిధి శ్యామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండలింగంపల్లి గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, పార్టీలో కొత్తగా చేరినవారిని కలుపుకొని వెళ్లాలని సూచించారు. పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పేదలకు అందేవిధంగా చూడాలన్నారు. ప్రతి కార్యకర్త ఎప్పుడు ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాలుయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, బాలయ్య, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



ఎంపీపీ మల్లేశంను సన్మానిస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.3లక్షలతో క్రికెట్ గ్రౌండ్‌కు, రూ.2లక్షలతో ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి ఈ నిధులు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చేనెల 4తో పదవికాలం ముగియడంతో ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



అయిల్ల శ్రీనివాస్



రాపెల్లి శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా ఆయిల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బజార శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీలు గంప ప్రవీణ్, ఆరవెల్లి ప్రణయ్, ట్రెజరర్ పర్శల మల్లేశం, ఈసీ మెంబర్లుగా ఎస్. కిరణ్, ఆర్.సాయిచంద్ర ప్రకాష్, వి.కావ్య, పి.భూమయ్య, జీసీఎం నాయిని దినకర్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని కరీంనగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ వి.వామన్‌రావు తదితరులు అభినందించారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్లటౌన్: తెలంగాణ స్టేట్ కిడ్స్ అండర్ 8, 10, 12 బాలబాలికలకు జిల్లా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ మీట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, జనరల్ సెక్రటరీ బొజ్జ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. జూలై 1న సిరిసిల్లలోని మినీస్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారు జూలై 7 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రీయ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 79014 64456, 94414 56385 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే సత్యంకు పరామర్శ

తంగళ్లపల్లి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి ఇటీవల మృతిచెందగా గురువారం బీఆర్ఎస్ మండల నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు కట్ట రవికుమార్, రషీద్, బొడ్డు శ్రీధర్, బొల్గం సతీశ్‌గౌడ్, తదితరులున్నారు.

నేడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి అజ్మీర రాందాస్ తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారు ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, విద్యార్థతల జిరాక్స్ ప్రతులు, మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కులం సర్టిఫికెట్‌తో నేరుగా హాజరు కావాలని సూచించారు.

సన్మానం



తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లె గ్రామ పంచాయతీ వందశాతం పన్నులు వసూలు చేసి మండలంలో ప్రథమ స్థానంలో నిలవడంతో ఎంపీడీవో జోగం రాజు గురువారం హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్లకు కృషిచేసిన పంచాయతీ కార్యదర్శి కొక్కుల ప్రవంతి, కారోబార్ గోపన్నగారి హరీశ్‌ను శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ దేశాయిపల్లె గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకొని మిగతా గ్రామాల కార్యదర్శులు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తైబజార్‌కు వేలం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే కూరగాయాల సంతకు ప్రత్యేకాధికారి సత్తయ్య సమక్షంలో గురువారం వేలం పాట నిర్వహించారు. జవ్వాజి రామస్వామి అనే వ్యక్తి రూ.3.70 లక్షలకు పాటపాడి తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 31, 2025 వరకు తైబజార్ కూరగాయల మార్కెట్‌కు వేలం పాట నిర్వహించారు. గతంలోనూ రామస్వామి వేలంలో కూరగాయల మార్కెట్‌ను దక్కించుకున్నారు. వేలం ద్వారా వచ్చిన డబ్బులను గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తామని ప్రత్యేకాధికారి సత్తయ్య అన్నారు. పంచాయతీ కార్యదర్శి దేవరాజు, మాజీవార్డు సభ్యులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొట్టిన కారు..

ఎల్లారెడ్డిపేట: హైదరాబాద్ రింగ్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు నేవూరి వెంకట్‌రెడ్డికి గురువారం స్వల్పగాయాలయ్యాయి. రింగ్ రోడ్డుపై వెళ్తున్న లారీని వెనుకనుంచి వెంకట్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. కారు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. వెంకట్‌రెడ్డి అతని స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రికి తరలించారు.